ఉదయం చలి మధ్యాహ్నం ఎండ రాత్రి చలిగాలులు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /అక్టోబర్ -25(అక్షరం న్యూస్)

ప్రస్తుతం రాజన్న సిరిసిల్ల జిల్లాలో వింత వాతావరణం కనిపిస్తోంది. ఉదయం వరకూ చలి ఉంటుంది. మధ్యాహ్నం ఎండ మండిపోతోంది. సాయంత్రానికి చలిగాలులు వణికిస్తున్నాయి.ఉదయం ఎనిమిది గంటల వరకూ చలి తీవ్రత ఉంటోంది. పదిగంటల నుంచీ ఎండ తీవ్రత మొదలై.. మళ్లీ మధ్యాహ్నం మూడుగంటల వరకూ అదే వేడి కొనసాగుతోంది. సాయంత్రం అయిదు తర్వాత మళ్లీ వాతావరణం పూర్తిగా చల్లబడుతోంది.ముఖ్యంగా రాత్రి వేళల్లో చలి తీవ్రత క్రమంగా పెరుగుతుండటంతో ప్రజలు ఉన్ని దుస్తులను బయటికి తీయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. రానున్న రెండు రోజుల పాటు ఉత్తర, పశ్చిమ తెలంగాణ జిల్లాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోయే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతాల్లో వీస్తున్న చల్లటి ఈదురుగాలుల కారణంగా సాధారణం కంటే తక్కువ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అధికారులు తెలిపారు. వాతావరణంలో వస్తున్న ఈ అకస్మాత్ మార్పుల వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు శ్వాసకోశ సమస్యలు ఉన్నవారు రాత్రి సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. సాయంత్రం వేళల్లో బయటికి వెళ్లేటప్పుడు తగిన రక్షణ దుస్తులు ధరించడం మంచిది.ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ అల్లకల్లోలం తుపాను కదలికల ప్రభావం కూడా రాష్ట్రంలోని వాతావరణ పరిస్థితులపై పడే అవకాశం ఉంది



పోలీసు అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీలు





జ్యోతి నగర్ ఎన్టిపిసి అక్టోబర్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్

రామగుండం పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు పోలీసు అంమరవీరుల వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పోలీసు అమరవీరులను స్మరిస్తూ కొవ్వొత్తుల ర్యాలీలు నిర్వహించారు. రామగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని సెంటెనరీ కాలనీ తెలంగాణ చౌరస్తా నుంచి మార్కెట్ చౌరస్తా వరకు, పెద్దపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో పెద్దపల్లి పట్టణంలోని జెండా చౌరస్తా వద్ద, మందమర్రి పోలీస్ స్టేషన్ పరిధిలో మందమర్రి పట్టణంలో పోలీసులు కొవ్వొత్తులతో ర్యాలీలు నిర్వహించి అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పోలీస్ అధికారులు మాట్లాడుతూ, శ్రీప్రజల ధన,మాన, ప్రాణాల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మరువలేనివని అన్నారు.వారి త్యాగాలు, ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజల రక్షణ, శాంతిభద్రతల పరిరక్షణ కోసం పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. అసాంఘిక శక్తులతో పోరాడుతూ వీరమరణం పొందిన పోలీసు అమరవీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని పేర్కొన్నారు. సమాజంలో శాంతి, భద్రతలను కాపాడేందుకు పోలీసులు రేయింబవళ్లు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ప్రజలు పోలీస్ శాఖకు సహకరిస్తూ, శాంతిభద్రతల పరిరక్షణలో తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, పోలీసుల సేవలను సద్వినియోగం చేసుకోవాలని పోలీస్ అధికారులు కోరారు.

ఎల్‌నినో ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి: మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి

‘ •ఓట్ బచావో -- దేశ్ బచావో’, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలపై చర్చ.



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 25 / అక్షరం న్యూస్ -:

కొత్తగూడెంలోని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య పాల్గొన్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రానున్న వాతావరణ పరిస్థితులు, చేపట్టాల్సిన ముందస్తు సన్నద్ధత, ‘ఓట్ బచావో -- దేశ్ బచావో’ కార్యక్రమం, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన పలు అంశాలపై సమావేశంలో చర్చించారు.

ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ముందస్తు ప్రణాళికలతో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరంపై సమావేశంలో చర్చించారు. వాతావరణ మార్పుల ప్రభావం ప్రజలపై పడకుండా అవసరమైన అంశాలను ముందుగానే గుర్తించడం, పరిస్థితులకు అనుగుణంగా సన్నద్ధం కావడం, సంబంధిత అంశాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవడం వంటి విషయాలకు ప్రాధాన్యతనిచ్చారు.

అదేవిధంగా ‘ఓట్ బచావో -- దేశ్ బచావో’ కార్యక్రమం ద్వారా ఓటు హక్కు ప్రాధాన్యత, ప్రజాస్వామ్య విలువలు, ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో అవగాహన పెంపొందించే అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమం ఉద్దేశాలను ప్రజలకు వివరించడంతో పాటు, ఓటు హక్కు పరిరక్షణ, ప్రజాస్వామ్య వ్యవస్థలో పౌరుల భాగస్వామ్యం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేపట్టాల్సిన చర్యలపై సమాలోచనలు జరిపారు.

రానున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పట్టభద్ర ఓటర్లతో సమన్వయం, ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన అంశాలు, ముందస్తు ఏర్పాట్లు, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా సమావేశంలో చర్చించారు. పట్టభద్ర ఓటర్లకు అవసరమైన సమాచారం అందించడం, ఎన్నికలకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించడం, సమన్వయంతో కార్యక్రమాలను నిర్వహించడం వంటి విషయాలను ప్రస్తావించారు.

జిల్లాకు సంబంధించిన వివిధ అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో ముందస్తు సన్నద్ధత, ప్రజలకు సంబంధించిన అంశాలపై అప్రమత్తతతో వ్యవహరించడం, ప్రజాస్వామ్య పరిరక్షణపై అవగాహన కార్యక్రమాలు, ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై సమగ్రంగా చర్చించారు.

ఈ సమావేశంలో ఏఐసీసీ కోఆర్డినేటర్ మేడి వెంకటేశ్, పీసీసీ కోఆర్డినేటర్ దుద్దిళ్ల శ్రీనుబాబు, డీసీసీ అధ్యక్షురాలు తోట దేవి ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

యెర్గిలో వైభవంగా బతుకమ్మ ఉత్సవాలు సర్పంచ్ సంతోష్ పాటిల్



మద్నూర్ / అక్టోబర్ 25 (అక్షరం న్యూస్ -- కామారెడ్డి):

నాందేడ్ జిల్లా దెగ్లూర్ తాలూకా పరిధిలోని యెర్గి గ్రామంలో బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు గ్రామ సర్పంచ్ సంతోష్ పాటిల్ తెలిపారు. ఈ నెల 26వ తేదీ సోమవారం సాయంత్రం 3 గంటలకు గ్రామంలోని శ్రీ హనుమాన్ ఆలయ ఆవరణలో బతుకమ్మ వేడుకలు ప్రారంభం కానున్నాయని ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా సర్పంచ్ సంతోష్ పాటిల్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగను యెర్గి గ్రామంలో ప్రతి సంవత్సరం మహిళలు, ఆడపడుచులు భక్తిశ్రద్ధలతో, ఎంతో ఉత్సాహంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన యెర్గిలో బతుకమ్మ పండుగకు ప్రత్యేక గుర్తింపు ఉందని తెలిపారు. గ్రామంలోని మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా అలంకరించి వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు. మహిళలందరూ ఐకమత్యంతో పాల్గొని పూల పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.అలాగే, ఆకర్షణీయంగా, అందంగా బతుకమ్మలను అలంకరించి తీసుకొచ్చే మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేయనున్నట్లు సర్పంచ్ ప్రకటించారు. గ్రామంలోని ప్రతి ఒక్కరూ ఈ వేడుకల్లో భాగస్వాములై, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను కాపాడుతూ బతుకమ్మ ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు.బతుకమ్మ పూల పండుగను గ్రామమంతా కలిసికట్టుగా జరుపుకొని, మహిళల ఆనందోత్సాహాల మధ్య వేడుకలను విజయవంతం చేయాలని సర్పంచ్ సంతోష్ పాటిల్ కోరారు.

శ్రీ శివకేశవుల బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా కళ్యాణోత్సవాలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /అక్టోబర్ -25(అక్షరం న్యూస్)

ముస్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ శివకేశవ ఆలయాల్లో ఆలయ చైర్మన్ సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల్లోభాగంగా ధ్వజారోహణ, హటరీమము, విశేష పూజలు, శ్రీ లక్ష్మీ పద్మావతి వేంకటేశ్వర కళ్యాణోత్సవం, వేద పండితులు పార్థసారథి పంతులు, హరీష్ రావు పంతులు, శ్రీ ఉమామహేశ్వర కళ్యాణోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. మహిళలు మంగళహారతుతో తరలివచ్చి దేవతామూర్తులకు నీరాజనం పలికారు. ఒడి బియ్యం సమర్పించారు. ఊరంతా పాడిపంటలతో విలసిల్లాలని మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో నాదే చైర్మన్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఆగుళ్ల రాజేశం, ముక్క మల్లయ్య, కంచం నర్సింహులు, ఎడమల రాజు రెడ్డి, రామచంద్రం గౌడ్, అరుట ఎల్లారెడ్డి, కోడె శ్రీనువాసు, ఆలయ కమిటీతో పాటు వందలాది భక్తులు పాల్గొన్నారు. నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

సామాన్యులకు చుక్కలు చూపిస్తున్న సన్న బియ్యం పెరుగుతున్న ధరలు



రాజన్న సిరిసిల్ల /ముస్తాబాద్ /అక్టోబర్ -25(అక్షరం న్యూస్)

ఎల్ ని నో ప్రభావంతో రోజురోజుకు పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలతో సామాన్యులు సతమతమవుతుంటే.. తాజాగా బియ్యం ధరలు చుక్కలనంటుతున్నాయి. దసరాకు ముందు క్వింటాల్ బియ్యం రూ.4,500 నుంచి రూ.6,500 మధ్య లభించగా.. ప్రస్తుతం నాణ్యత, రకాలను బట్టి క్వింటాలు ధర రూ. 9 వేల నుంచి రూ.12 వేల వరకు ధర పలుకుతోంది. ముఖ్యంగా సన్న బియ్యం ధరలు సామాన్యులకు అందనంత ఎత్తుకు చేరుకున్నాయి. కిలో సన్న బియ్యం ధర రూ.90 వరకు ఉండటంతో సమాన్యుడి నెలవారీ ఇంటి బడ్జెట్ తలకిందులవుతోంది. నిత్యం అన్నం తినే పేద, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యం కొనుగోలు భారంగా మారిపోయింది. మార్కెట్లో 25 కిలోల సన్న బియ్యం బస్తా ధర నాణ్యతను బట్టి రూ.1,700 నుంచి రూ.2,100కు పైగా పలుకుతోంది. గతంలో తక్కువ ధరకు లభించిన బియ్యం ప్రస్తుతం అధిక ధరలకు చేరడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు

సామాన్యుల బడ్జెట్‌పై ప్రభావం..

బియ్యం ధరలు అమాంతం పెరగడంతో సామాన్యుల బడ్జెట్ తలకిందులవు తున్నది. ఇప్పటికే పెరిగిన ధరలతో ఆందోళన వ్యక్తమవుతున్నది.. సన్న బియ్యం ధరలు తమ అంచనాలకు అందకుండా పెరిగాయని, పాత నాణ్యమైనబియ్యం కిలో ధర వందకు చేరిందని, ఇలా అయితే తాము బతికేదెలా అని ఆవేదన చెందుతున్నారు. ప్రస్తుతం ధరలు పెరగకుండా ఉండాలంటే హోల్సేల్ గోదాముల్లో ఉన్న ధాన్యం, బియ్యం నిల్వల వివరాలను ఎప్పటికప్పుడు సేకరించి, కృత్రిమ కొరత సృష్టించకుండా చూడాలని కోరుతున్నారు. అలాగే అక్రమ నిల్వలు, ఉద్దేశపూర్వకంగా సరఫరా నిలిపివేయడం వంటి ఉల్లంఘనలకు పాల్ప డకుండా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఇదే సమయంలో ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించి, సన్నరకం ధాన్యాన్ని బహిరంగ మార్కెట్ ధర ప్రకారం కొనాలని కోరుతున్నారు. అలా అయితేనే బియ్యం ధరలు అదుపులో ఉంటాయని చెబుతు న్నారు.


బియ్యం ధర చూస్తే భయమేస్తున్నది

మునుపటితో చూస్తే బియ్యం రేటు రెండింతలైంది. ధరలు చూస్తే భయమే స్తున్నది. ఇలా ఉంటే సామాన్యుల నెల వారీ ఖర్చులు భరించడం కష్టమవు తుంది. ప్రభుత్వం చర్యలు తీసుకొని బియ్యం ధరలు నియంత్రించాలి. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తే అధికారులు దాడులు జరపాలి. కొత్త బియ్యం కొను గోలు చేద్దామనుకుంటే అన్నం ముద్దగా అవుతుంది.

రమేష్ రెడ్డి చీకోడ్..

చిన్నారులను ఆశీర్వదించిన

•మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

తల్లాడ మండల పరిధిలోని గొల్లగూడెం గ్రామ పంచాయితీ క్రిష్ణపురం గ్రామం నందు కోడూరి సత్యనారాయణ, లక్ష్మి దంపతుల కుమార్తె, కుమారుల ఓణిల , పంచకట్టు వేడుక వారి స్వగృహం నందు అంగరరంగ వైభవం గా జరిగింది. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిధిగా సత్తుపల్లి మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకట వీరయ్య పాల్గొని చిన్నారులను ఆశీర్వదించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరొహించాలని దీవించారు.ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీను, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డం వీర మోహన్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి దుగ్గిదేవర వెంకటలాల్, సత్తుపల్లి నియోజకవర్గ బిసి సెల్ నాయకులు కోడూరి వీర కృష్ణ, బీఆర్ఎస్ పార్టీ తల్లాడ టౌన్ అధ్యక్షులు జివిఆర్ , గొల్లగూడెం గ్రామ సర్పంచ్ కోడూరి ఉమాదేవి వీరకృష్ణ, వార్డు మెంబెర్స్ విలసాగరం వెంకట రావు, కోడూరి దుర్గ రావు, లయన్స్ క్లబ్ అధ్యక్షులు కోడూరి నాగేశ్వరావు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు,కుటుంబ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే సండ్ర పరామర్శ



ఖమ్మం/ తల్లాడ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

నూతనకల్ గ్రామంలో అనారోగ్య కారణంతో మృతి చెందిన తోట శ్రీనివాసరావు, షేక్ హుస్సేన్ కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య పరామర్శించి, ఓదార్చారు.వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రెడ్డం వీర మోహన్ రెడ్డి, వెంకట్ లాల్ మాజీ ఎంపీపీ దొడ్డ శ్రీనివాసరావు, జివిఆర్ నూతనకల్ మాజీ సర్పంచ్ తూము శ్రీనివాసరావు నాయుడు శ్రీనివాసరావు మాజీ సర్పంచ్ శెట్టిపల్లి లక్ష్మణరావు వార్డ్ మెంబర్ అడపా సురేష్ గారు కళ్యాణపు కృష్ణయ్య చెరుకూరి రమేష్ గారు వేమిరెడ్డి సీతారాం రెడ్డి తోట రమేష్ బలవంతపు రవీంద్ర నెల్లూరి అనిల్ తదితరులు పాల్గొని వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి : జిల్లా కలెక్టర్ అంకిత్



భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 25 / అక్షరం న్యూస్ –:

అక్టోబర్ 26 వ తేదీ, సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు ఉదయం 10గంటలకు హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని ఆయన సూచించారు.ఉదయం 10.30 గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆయన అన్నారు. జిల్లా ప్రజల సౌకర్యార్థం సబ్ కలెక్టర్ కార్యాలయం భద్రాచలం మరియు ఆర్డీవో కార్యాలయం కొత్తగూడెంలో ప్రజావాణి నిర్వహించబడుతుందని, అదేవిధంగా జిల్లాలోని అన్ని మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆయన అన్నారు. కావున ప్రజలు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోరారు.

శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధానంలో అమ్మవారి తిరుగు వారంపండుగ.



జనగామ జిల్లా రఘునాథపల్లి (అక్షరం న్యూస్) అక్టోబర్25:

మండలంలోని ఇబ్రహీంపూర్ గ్రామంలో వెలసిఉన్న హనుమత్ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి సన్నిధానంలో శ్రీ దేవి శరన్నవరాత్రోస్వంలో అంగరంగ వైభవంగా నిర్వహించి ముగించుకున్న సందర్భంలో అమ్మవారి తిరుగువారం (పదహారవ)పండుగ వేద మంత్రోత్సవంలో శివ శ్రీ బెలిగిని మఠం. శివ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పోకల శ్రీనివాస్, ఉప సర్పంచ్ చింత నరేష్, గ్రామ పెద్దలు పుల్ల రవి, కాసర్ల లక్ష్మయ్య, పర్వతాలు, పబ్బ శేఖర్ , కొండ అశోక్, నల్లా నరేష్ గట్టయ్య, జోగు శ్రీధర్, గ్యార వంశీ,మాలధారణ భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెంలో సైకిల్ ర్యాలీ





భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 25 / అక్షరం న్యూస్ –:

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసులు, టీజీఎస్పీ పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కొత్తగూడెం రైల్వే స్టేషన్ సమీపం నుంచి పాత డిపో, పోస్ట్ ఆఫీస్ సర్కిల్ మీదుగా కొత్తగూడెం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు, వారి సేవలను ప్రజలకు తెలియజేయడం, పోలీసుల సేవలు మరియు త్యాగాల పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ ర్యాలీ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. దేశం, సమాజం, ప్రజల రక్షణ కోసం అమరవీరులు చేసిన త్యాగాలు ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు నిరంతరం కృషి చేస్తున్నారని, పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. పోలీసులకు, ప్రజలకు మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయడంలో ఇటువంటి కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ, టీజీఎస్పీ అసిస్టెంట్ కమాండెంట్లు రామకృష్ణారెడ్డి, రంజిత్ కుమార్, సీఐలు వెంకటేశ్వర్లు, ఇంద్రసేనారెడ్డి, జితేందర్, ఆర్ఐలు సుధాకర్, కృష్ణారావు, జి.వి. రామారావు, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొత్తగూడెం ఏరియా భవిష్యత్తును కాపాడాలి



•ఖాళీల భర్తీ, సర్ఫస్ కన్వర్షన్ వేగవంతం చేయాలి ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్.

భద్రాద్రి కొత్తగూడెం / కొత్తగూడెం / అక్టోబర్ 25 / అక్షరం న్యూస్ –:

సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయడంతోపాటు, కార్మికుల సమస్యలను పరిష్కరించి ఏరియా భవిష్యత్తుకు భరోసా కల్పించాలని ఏఐటీయూసీ అదనపు ప్రధాన కార్యదర్శి మిరియాల రంగయ్య డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో నిర్వహించిన ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. వీకే కోల్‌మైన్‌లో పర్మినెంట్ కార్మికులతోనే బొగ్గు ఉత్పత్తి చేపట్టాలని, కార్మికుల హక్కులకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఉద్యమం చేపడతామని యాజమాన్యాన్ని హెచ్చరించారు. పీవీకే–5 భూగర్భ గనిలో విధులు నిర్వహిస్తున్న జనరల్ అసిస్టెంట్ల సర్ఫస్ కన్వర్షన్ ప్రక్రియను పెండింగ్‌లో పెట్టడం సరికాదని రంగయ్య అన్నారు. సీనియారిటీ ప్రకారం కన్వర్షన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి అర్హులైన కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏరియాలోని అన్ని సబ్‌కమిటీలను ఏర్పాటు చేసి కార్మికుల సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు యాజమాన్యం చర్యలు తీసుకోవాలని సూచించారు.కొత్తగూడెం ఏరియా భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారకుండా నూతన గనుల ఏర్పాటుపై యాజమాన్యం ప్రత్యేక దృష్టి సారించాలని రంగయ్య కోరారు. పెనగడప సమీపంలోని రాంపురం వద్ద ఇప్పటికే సర్వే నిర్వహించిన ప్రాంతంలో గని ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. సుమారు 300 అడుగుల లోతులో ఉన్న ఈ ప్రాంతం కోల్ గ్యాసిఫికేషన్‌కు అనుకూలంగా ఉందని పేర్కొంటూ, అక్కడ గనిని ప్రారంభించి ఏరియా భవిష్యత్తును కాపాడాలని కోరారు. అనిశెట్టిపల్లి, పునుకుదుచిలుక ప్రాంతాల్లోని బొగ్గు నిల్వలను సింగరేణి సంస్థ వెంటనే టేకప్ చేసి స్థానిక నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.కార్మిక సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ కొత్తగూడెం ఏరియాలోనూ నెహ్రూ కాలనీల తరహాలో నివాస కాలనీలు నిర్మించాలని రంగయ్య కోరారు. కార్మికులకు సొంతింటి సౌకర్యం కల్పించడంతోపాటు ఖాళీల భర్తీ, ఉద్యోగ భద్రత, గనుల అభివృద్ధిపై యాజమాన్యం సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సూచించారు.సమ్మె నోటీసుకు సంబంధించి ఆర్ఎల్‌సీ సమక్షంలో జరిగిన చర్చల్లో అంగీకరించిన 24 డిమాండ్లను యాజమాన్యం త్వరితగతిన అమలు చేయాలని ఏరియా కార్యవర్గ సమావేశం డిమాండ్ చేశారు.కార్మిక సమస్యల పరిష్కారంలో జాప్యం చేస్తే యాజమాన్యానికి వ్యతిరేకంగా ఉద్యమాన్ని చేపడతామని నాయకులు హెచ్చరించారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ కేంద్ర ప్రచార కార్యదర్శి వీరస్వామి, బ్రాంచ్ కార్యదర్శి జక్కుల గట్టయ్య, ఉపాధ్యక్షుడు కత్తర్ల రాములు, ఆఫీస్ బేరర్లు సందబోయిన శ్రీనివాస్, ఎస్. నాగేశ్వరరావు, హుమాయూన్, హీరాలాల్, గుమ్మడి వీరయ్య, కుర్ర రమేష్, పిట్ కార్యదర్శులు భూక్య రమేష్, మధు కృష్ణ, కమల్, మెంగన్ రవి, సురేందర్, సీనియర్ నాయకులు బండారి మల్లయ్య, మండల రాజేశ్వరరావు, కోటి, సవాటీ స్వామి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

•మంత్రి పొంగులేటికి ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల జేఏసీ నాయకుల వినతి..



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 25(అక్షరం న్యూస్)

జాతీయ ఆరోగ్య మిషన్ (ఎన్ హెచ్ ఎం) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ ఖమ్మం జిల్లా ఎన్ హెచ్ ఎంజేఏసీ నాయకులు రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు . రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టడానికి గల కారణాలను మరియు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు . రాష్ట్రంలో సుమారు 17,600 మంది ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నప్పటికీ , ఉద్యోగ భద్రత , వేతనాలు , వైద్య సదుపాయాలు , ఇతర సేవా ప్రయోజనాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు . ఉద్యోగ భద్రత కల్పించడం , సమాన పనికి సమాన వేతనం అమలు , మహిళలకు 180 రోజుల వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు , ఈ హెచ్ ఎస్ ద్వారా నగదు రహిత వైద్యం , ప్రతి నెలా 5వ తేదీలోపు జీతాల చెల్లింపు వంటి డిమాండ్లను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు . అలాగే వార్షిక 5 శాతం ఇంక్రిమెంట్ , 8 శాతం లాయల్టీ బోనస్ , 2022 నుంచి పెండింగ్‌లో ఉన్న బకాయిల చెల్లింపు , రూ.20 లక్షల గ్రాట్యుటీ , ఉద్యోగి మరణిస్తే రూ.20 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు అర్హులైన కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని కోరారు . ఔట్‌సోర్సింగ్ విధానంపై పునఃపరిశీలన చేసి ఉద్యోగులను స్టేట్ హెల్త్ సొసైటీ పరిధిలో కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు . గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు నిరంతర ఆరోగ్య సేవలు అందిస్తున్న ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి , న్యాయమైన డిమాండ్లను సానుకూలంగా పరిష్కరించాలని నాయకులు కోరారు . ఈ కార్యక్రమంలో ఎన్ హెచ్ ఎం జేఏసీ నాయకులు డాక్టర్ మాధవి , రఘురామ్ , డాక్టర్ వెంకట్‌లాల్ , డాక్టర్ వి.వి.రావు , డాక్టర్ మనోజ్ , డాక్టర్ కాశయ్య తదితరులు పాల్గొన్నారు .

ఏఐకేఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



ఖమ్మం/తల్లాడ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

తల్లాడ మండలం కలకోడిమ గ్రామంలో తెలంగాణ రైతు సంఘం తల్లాడ మండల కమిటీ ఆధ్వర్యంలో అఖిల భారత రైతు సంఘం (ఏఐకేఎస్) 36వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. నవంబర్ 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే ఈ మహాసభలకు రైతులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదినేని రమేష్ మాట్లాడుతూ, 1936లో స్థాపించబడిన అఖిల భారత రైతు సంఘం నాటి నుంచి నేటి వరకు రైతుల సమస్యల పరిష్కారం కోసం అనేక పోరాటాలు నిర్వహించిందని తెలిపారు. పెట్టుబడిదారీ విధానాల ప్రభావంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, కార్పొరేట్ వ్యవసాయాన్ని ప్రోత్సహించే విధంగా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయని విమర్శించారు.రైతులు పోరాటాల ద్వారా సాధించుకున్న చట్టాలను బలహీనపరుస్తూ, కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా రైతు వ్యతిరేక విధానాలను అమలు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లభించడం లేదని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పక్కన పెట్టారని విమర్శించారు.ప్రస్తుతం నల్లగొండ గడ్డపై జరుగుతున్న రైతు సంఘం జాతీయ మహాసభలకు రైతులు తమ వంతు ఆర్థిక సహకారం అందించాలని ఆయన కోరారు. మహాసభల సందర్భంగా నిర్వహించే బహిరంగ సభలో రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మహాసభల్లో రైతాంగ సమస్యలపై చర్చించి, భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకుని, రాబోయే పోరాటాలకు సిద్ధం కావాలని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో రైతు సంఘం డివిజన్ కమిటీ సభ్యులు సేలం సత్యనారాయణ రెడ్డి, రైతు సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు కళ్యాణపు కృష్ణయ్య, నల్లమోతు మోహన్ రావు, అయినాల రామలింగేశ్వర రావు, పులి కృష్ణయ్య, ఆదూరి జీవరత్నం, కొమ్మినేని ఆదినారాయణ, చల్లా నాగేశ్వరరావు, వడ్డే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- అక్టోబర్ 28న అక్కడక్కడా అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం..
- రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి..
- ఉరుములు, మెరుపులు, ఈదురుగాలుల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఖమ్మం జిల్లాలో రానున్న మూడు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.భారత వాతావరణ శాఖ అక్టోబర్ 25న జారీ చేసిన వాతావరణ బులెటిన్ ప్రకారం ఈ నెల 27న జిల్లాలో అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు.అక్టోబర్ 28న జిల్లాలో అక్కడక్కడా భారీ నుంచి అతి భారీ వర్షాలతో పాటు అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, గంటకు 50 నుంచి 60 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించిందని పేర్కొన్నారు. అక్టోబర్ 29న కూడా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని తెలిపారు.వర్షాల నేపథ్యంలో రైతులు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి:

ఉరుములు, మెరుపులు సంభవించే సమయంలో ప్రజలు బహిరంగ ప్రదేశాల్లో ఉండరాదని, చెట్ల క్రింద, విద్యుత్ స్తంభాల సమీపంలో ఆశ్రయం పొందరాదని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని సంబంధిత శాఖల అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలు, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ప్రజలు, రైతులు తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

గోదావరి జలాలను ఒడిసిపట్టి వేసవి తాగునీటి అవసరాలు తీర్చడమే లక్ష్యం





- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటి నిల్వకు చర్యలు..
- ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలి..
- ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో నీటి పాడుపుపై ప్రజలకు పిలుపు..
- నీటి లభ్యతకు అనుగుణంగా రబీ పంటలు సాగు చేయాలి

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ భద్రాచలం అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

ఎల్‌నినో ప్రభావంతో రానున్న కాలంలో ఏర్పడే వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని, రానున్న వేసవిలో తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. ఆదివారం అశ్వాపురం మండలం అమ్మగారిపల్లి గ్రామ పరిధిలోని దుమ్ముగూడెం ఆనకట్టను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు.ఆనకట్టపై ఇసుక బస్తాలతో నీటిని నిల్వ చేసేందుకు చేపడుతున్న పనులను పరిశీలించిన మంత్రి, పనుల పురోగతి, గోదావరి నీటి ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మగారిపల్లి నుంచి దుమ్ముగూడెం వరకు పడవలో ప్రయాణిస్తూ ఆనకట్ట పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దుమ్ముగూడెం వైపు ఆనకట్టపై ఇసుక బస్తాలతో చేపడుతున్న పనులను మరింత వేగవంతం చేయాలని, అవసరమైతే అదనపు కార్మికులను నియమించి, పడవలను పెంచి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత ఇంజినీరింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ , ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంపై వాతావరణ శాస్త్రవేత్తలు వ్యక్తం చేస్తున్న అంచనాలను దృష్టిలో ఉంచుకుని ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వాతావరణ మార్పులు వ్యవసాయం, విద్యుత్ ఉత్పత్తి, పారిశ్రామిక రంగం, ప్రజారోగ్యం, పశుసంపదపై ప్రభావం చూపే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజలను భయాందోళనలకు గురిచేయడం తమ ఉద్దేశం కాదని, రానున్న పరిస్థితులను ముందుగానే అర్థం చేసుకుని నష్టాలను నివారించేందుకు ప్రజల్లో అవగాహన, ఆత్మస్థైర్యం పెంపొందించడమే లక్ష్యమని తెలిపారు.

ఈ ఏడాది వర్షపాతం లోటు, నదులు, వాగులు, వంకల్లో తగ్గిన నీటి ప్రవాహాలు, రిజర్వాయర్లలో పరిమిత నీటి నిల్వల కారణంగా భూగర్భ జలాలపై ఒత్తిడి పెరుగుతోందని మంత్రి పేర్కొన్నారు. అనేక ప్రాంతాల్లో బోర్ల నుంచి నీరు అందక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చడం ప్రధాన సవాలుగా మారే అవకాశం ఉందన్నారు. అందుబాటులో ఉన్న ప్రతి నీటి బొట్టును జాగ్రత్తగా వినియోగించుకోవాలని, నీటి వృథాను నివారించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

దుమ్ముగూడెం ఆనకట్టపై ఇసుక బస్తాలను ఏర్పాటు చేసి గోదావరి నీటిని నిల్వ చేయడం ద్వారా రానున్న వేసవిలో తాగునీటి అవసరాలను తీర్చేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. ఇంజినీరింగ్ అధికారుల సూచనల మేరకు ఆనకట్టపై సుమారు ఒక మీటర్ ఎత్తున ఇసుక బస్తాల పొరలను ఏర్పాటు చేసి దాదాపు ఒక టీఎంసీ నీటిని నిల్వ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఈ నీటి నిల్వ ద్వారా తాగునీటి అవసరాలకు అవసరమైన నీటిని అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. సాధారణంగా వేసవిలో గోదావరిలో నీటి ప్రవాహం తగ్గిపోయే పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే నీటిని నిల్వ చేయడం అవసరమని తెలిపారు .

ఆనకట్టపై ఇసుక బస్తాల ఏర్పాటు పనులను వేగవంతం చేసేందుకు రోజుకు 10 వేల నుంచి 15 వేల బస్తాలను ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సుమారు లక్షన్నర ఇసుక బస్తాలు అవసరం అవుతున్నాయాన్నారు.అవసరాన్ని బట్టి కార్మికుల సంఖ్యను పెంచి, పనులకు ఆటంకం కలగకుండా అదనపు పడవలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వాతావరణ శాఖ వర్ష సూచనలను పరిగణనలోకి తీసుకుంటూ గోదావరి ప్రవాహంలో వచ్చే మార్పులకు అనుగుణంగా పనులు నిర్వహించాలని, ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురిసి ప్రవాహం పెరిగినప్పటికీ చేపట్టిన పనులకు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.ప్రస్తుత పరిస్థితుల్లో తాగునీటి పథకాలు నిరంతరాయంగా కొనసాగాలంటే నీటి నిల్వలను కాపాడుకోవడం అత్యంత అవసరమని మంత్రి స్పష్టం చేశారు. భద్రాచలంతో పాటు ఇతర ప్రాంతాల్లో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి పంపిణీని సమన్వయంతో నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆనకట్ట వద్ద నీటిని నిల్వ చేస్తూనే అవసరమైన ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. ఒక టీఎంసీ నీటి నిల్వ లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.

వ్యవసాయ రంగంపై ఎల్‌నినో ప్రభావం పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రబీ సాగులో ఆచితూచి నిర్ణయాలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రిజర్వాయర్లలో నీటి నిల్వలు, భూగర్భ జలాల లభ్యత, విద్యుత్ సరఫరా పరిస్థితులను అంచనా వేసుకుని అందుబాటులో ఉన్న వనరులకు అనుగుణంగా పంటలను సాగు చేయాలని కోరారు. తక్కువ నీటితో పండే కూరగాయలు, చిరుధాన్యాలు, పప్పుధాన్యాలు, ఆరుతడి పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. భూమిలో ఉన్న తేమ, నీటి లభ్యత ఆధారంగా సాగు ప్రణాళిక రూపొందించుకోవాలని, అధిక నీటి అవసరం ఉండే పంటల సాగు విషయంలో అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.ప్రస్తుత సీజన్‌లో అందుబాటులో ఉన్న గోదావరి జలాలను సమర్థవంతంగా వినియోగించుకుంటూ సాగులో ఉన్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి వివరించారు. రాజీవ్ లింక్ కెనాల్ ద్వారా సాగర్ ఆయకట్టుకు నీటిని అందించడంతో పాటు వైరా, లంకసాగర్ ప్రాజెక్టుల్లో నీటి నిల్వలను పెంచేందుకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తుమ్మల చెరువు, సింగభూపాలం, అన్నదైవం, మూకమామిడి వంటి చెరువులను నింపడం ద్వారా భూగర్భ జలాల పెంపు, పశువులకు నీటి లభ్యత, రైతుల సాగు అవసరాలకు ప్రయోజనం చేకూర్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.

రైతులకు అవసరమైన విద్యుత్‌ను అందించడంతో పాటు పండించిన పంటలను కొనుగోలు చేయడం, రైతు భరోసా వంటి సహాయక చర్యలను కొనసాగిస్తూ రైతాంగానికి అండగా నిలుస్తున్నామని మంత్రి తెలిపారు. రానున్న కాలంలో కరువు పరిస్థితులు ఏర్పడే ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై అఖిలపక్షంతో చర్చించి, అవసరమైన సహాయ సహకారాల కోసం కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తామని పేర్కొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టాలని మంత్రి సూచించారు. పంట కాలువల మరమ్మతులు, చెక్‌డ్యామ్‌ల నిర్మాణం, చెరువుల్లో పూడికతీత, గ్రామీణ రహదారుల అభివృద్ధి వంటి పనులకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా గ్రామీణ ఉపాధిని పెంచడంతో పాటు భవిష్యత్తులో నీటి వనరులను మెరుగుపరుచుకోవచ్చన్నారు. పశువులకు, అవసరమైన చోట అడవి జంతువులకు కూడా నీటి లభ్యత కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొంటూనే భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడే శాశ్వత ఆస్తుల కల్పనపై అధికారులు దృష్టి సారించాలని తెలిపారు.

నీటి పొదుపు, విద్యుత్ పొదుపు, ప్రజారోగ్య పరిరక్షణపై గ్రామస్థాయి నుంచి విస్తృత అవగాహన కల్పించాలని మంత్రి కోరారు. రైతు వేదికలు, గ్రామసభల ద్వారా రైతులకు వాతావరణ పరిస్థితులు, పంటల ఎంపిక, నీటి వినియోగంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, రెవెన్యూ శాఖల అధికారులు గ్రామస్థాయిలో సమన్వయంతో పనిచేస్తూ ప్రజలకు అవసరమైన సూచనలు అందించాలని ఆదేశించారు.రానున్న కాలంలో నీటి కొరత తీవ్రం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో అధికార యంత్రాంగంతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, కూడా భాగస్వాములు కావాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. నీటి వనరుల పరిరక్షణ, తాగునీటి పొదుపు, రైతులకు అవగాహన కల్పించడం వంటి అంశాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దుమ్ముగూడెం ఆనకట్టపై ఒక టీఎంసీ నీటిని నిల్వ చేసే లక్ష్యాన్ని సాధించేందుకు సంబంధిత శాఖల అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమం లో ఇరిగేషన్ శాఖా ఎస్ ఈ, అమ్మగారి పల్లి సర్పంచ్ కవిత, సంబంధిత శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్‌లో సీటు సాధించిన ఆదివాసీ విద్యార్థికి ఆర్థిక సహాయం

- వైరా ఎస్ఐ పుష్పాల రామారావు
- చేతుల మీదుగా రూ.10 వేల నగదు అందజేత

ఖమ్మం/వైరా అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయి, అమ్మమ్మ వద్ద ఉంటూ కూలి పనులు చేసుకుంటూ చదువుకున్న ఓ ఆదివాసీ విద్యార్థి పట్టుదలతో ఎంబీబీఎస్‌లో ప్రభుత్వ కోటాలో సీటు సాధించాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం టేకులగూడెంకు చెందిన నక్క సంతోష్ నీట్‌లో మంచి ర్యాంకు సాధించి కొడంగల్‌లోని ప్రభుత్వ వైద్య కళాశాలలో ప్రవేశం పొందాడు.విద్యాభ్యాసం కోసం ఎన్నో కష్టాలను ఎదుర్కొన్న సంతోష్‌కు పలువురు దాతలు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తున్నారు. ఈ క్రమంలో సోమవారం గ్రామానికి చెందిన ఎన్నారై కొండబోలు సురేష్ కుమార్ అందించిన ఆర్థిక సహకారంతో రూ.10 వేల నగదును ఈ రోజు వైరా పట్టణ పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి సంతోష్‌కు అందజేశారు. వైరా పట్టణ ఎస్ఐ పుష్పాల రామారావు, విశ్రాంత అధ్యాపకులు బెజవాడ వీరభద్రరావుతో



కలిసి ఈ నగదును అందించారు.ఈ సందర్భంగా ఎస్ఐ పుష్పాల రామారావు మాట్లాడుతూ, మారుమూల ఆదివాసీ గూడెంలో జన్మించి, చిన్నతనంలోనే తల్లిదండ్రులను కోల్పోయినప్పటికీ సంతోష్ పట్టుదలతో చదువును కొనసాగించి నీట్‌లో మంచి ర్యాంకు సాధించి ప్రభుత్వ కోటాలో ఎంబీబీఎస్ సీటు పొందడం అభినందనీయమన్నారు. అతని విజయ ప్రస్థానం ఆదివాసీ విద్యార్థులందరికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఆర్థిక ఇబ్బందులు విద్యకు అడ్డంకి కాకూడదని, ప్రతిభ కలిగిన పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. సంతోష్ భవిష్యత్తులో వైద్యుడిగా ఎదిగి పేదలకు, ముఖ్యంగా గిరిజన ప్రాంత ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు.

ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తాం

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి
- రూ. 38 కోట్లతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణం..
- ఏదులాపురం మున్సిపాలిటీలో ఇప్పటికే రూ. 75.50 కోట్ల నిధులు మంజూరు.
- ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు..
- ఏదులాపురం మున్సిపాలిటీలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి



ఖమ్మం/స్టాఫ్ రిపోర్టర్ ఏదులాపురం, అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

ఏదులాపురం మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఆదివారం ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్, మున్సిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనితతో కలిసి పర్యటించిన మంత్రి, రూ.38 కోట్లతో మద్దులపల్లి నుంచి గొల్లగూడెం రోడ్డు వరకు చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి, సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణ పనులతో పాటు రూ.కోటి వ్యయంతో చేపట్టిన జంక్షన్ల అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రూ.38 కోట్లతో చేపట్టనున్న నాలుగు లైన్ల రహదారి నిర్మాణం పూర్తయితే ఏదులాపురం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. మద్దులపల్లి నుంచి గొల్లగూడెం వరకు నిర్మించనున్న ఈ రహదారితో పాటు సెంట్రల్ లైటింగ్, డివైడర్, సీసీ డ్రైన్ల నిర్మాణం చేపడుతున్నా మని, పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని పేర్కొన్నారు.

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఇప్పటికే ప్రభుత్వం రూ.75.50 కోట్ల నిధులను మంజూరు చేసిందని తెలిపారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఏదులాపురాన్ని ఆదర్శ మున్సిపాలిటీగా అభివృద్ధి చేస్తున్నామని, ఇప్పటికే సుమారు రూ.100 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు కేటాయింపులు జరిగాయని వివరించారు. రహదారులు, డ్రైనేజీలు, జంక్షన్ల అభివృద్ధి తదితర మౌళిక సదుపాయాలను మెరుగుపరిచి పట్టణ ప్రజలకు మెరుగైన వసతులు కల్పిస్తామని స్పష్టం చేశారు.

ఆర్థిక సవాళ్ల మధ్యనూ సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం సమాంతరంగా అమలు చేస్తోందని మంత్రి తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సవాళ్లతో కూడుకున్నప్పటికీ పేద ప్రజల సంక్షేమానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని పేర్కొన్నారు.గత పాలకులు సృష్టించిన ఆర్థిక అవరోధాలను అధిగమిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, ఇందిరమ్మ ప్రభుత్వం పేద ప్రజలకు ప్రతి దశలో అండగా నిలుస్తుందని అన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తున్నామని తెలిపారు.సూపర్ ఎల్‌నినో ప్రభావం ఒక్క తెలంగాణ రాష్ట్రానికే పరిమితం కాదని, ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాలు ఈ పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో నీటి లభ్యతపై అనిశ్చితి నెలకొనే అవకాశం ఉన్నందున ప్రజలు, రైతులు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు.వానాకాలంలో రైతులు సాగు చేసిన తొలి పంటను కాపాడేందుకు ప్రభుత్వం ఎంత ఖర్చుకైనా వెనుకాడదని స్పష్టం చేశారు. పంటలకు అవసరమైన నీరు, విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని తెలిపారు. అయితే, రానున్న కాలంలో నీటి కొరత ఏర్పడే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని రైతులు రెండో పంట వేయవద్దని విజ్ఞప్తి చేశారు. అందుబాటులో ఉన్న నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు.

ప్రజల అవసరాలపై ముందస్తు కార్యాచరణ:

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపడుతోందని మంత్రి తెలిపారు. సంక్షోభ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహిస్తామని తెలిపారు.

తెలంగాణకు కేంద్రం సహకరించాలి:

సూపర్ ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా అవసరమని మంత్రి పేర్కొన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోయినా తెలంగాణకు ఎలాంటి వివక్ష లేకుండా కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

తెలంగాణకు అవసరమైన సహాయం అందేలా బీజేపీ ఎంపీలందరూ కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి రాష్ట్రానికి తగిన మద్దతు లభించేలా కృషి చేయాలని కోరారు. కరువు పరిస్థితులను గతంలో ఎదుర్కొన్న అనుభవం రైతులకు ఉందని, ప్రస్తుత పరిస్థితులను అర్థం చేసుకుని నీటిని పొదుపుగా వినియోగిస్తూ ప్రభుత్వానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు నిర్వహించినట్లు తెలిపారు. గిరిజన భవన్, వసతి గృహం, వివిధ రహదారుల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని పేర్కొన్నారు. రూ.38 కోట్లతో చేపట్టనున్న రహదారి నిర్మాణం ఎంతో ప్రాధాన్యత కలిగిన పనిగా పేర్కొంటూ, మంజూరైన నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రజలకు దీర్ఘ కాలికంగా ఉపయోగపడేలా పనులు చేపట్టాలని తెలిపారు.

ఏదులాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అనిత మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో ఏదులాపురం మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని తెలిపారు. మంత్రి దూరదృష్టి, అభివృద్ధి పట్ల ఉన్న ఆలోచనలతో మున్సిపాలిటీలో మౌళిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత లభిస్తోందని పేర్కొన్నారు. ఏదులాపురం అభివృద్ధికి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఖమ్మం ఆర్డీఓ ఎన్. శ్రీనివాస్, ఏదులాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ తమ్మినేని నవీన్, మద్దులపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబు, మున్సిపల్ కమిషనర్ ఏ. శ్రీనివాస రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్లుగా నమోదు చేసుకోండి

- వైరా కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 25(అక్షరం న్యూస్)

వైరా: ఖమ్మం--వరంగల్--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ పరిధిలోని అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని వైరా మున్సిపాలిటీ 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత ప్రసాద్ విజ్ఞప్తి చేశారు.త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమని, పట్టభద్రులు తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియజేసే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.అర్హులైన పట్టభద్రులు నిర్ణీత గడువులోగా అవసరమైన ధ్రువపత్రాలతో తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవాలని సునీత ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. పట్టభద్రులందరూ ఈ ప్రక్రియపై అవగాహన పెంచుకొని, ఓటరు నమోదులో భాగస్వాములు కావాలని సునీత కోరారు.

బోడ మిరియాలు దశదిన కర్మ కు హాజరై నివాళులర్పించినవైరా నియోజవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ సుందర్ లాల్



ఖమ్మం/వైరా అక్టోబర్ 25(అక్షరం న్యూస్)

వైరా నియోజవర్గ పరిధిలోనిజూలూరుపాడు: మండల పరిధిలోని మాచినేనిపేట గ్రామానికి చెందిన కీ.శే. బోడ మిరియాలు ఇటీవల మృతి చెందారు. ఆదివారం ఆమె దశదిన కర్మ వారి గ్రామంలో నిర్వహించారు. కార్యక్రమానికి వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ సుందర్ లాల్ ఆదివారం హాజరై ఈ సందర్భంగా బోడ మిరియాలు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం:- ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి మనోధైర్యం కల్పించారు. ఆప్తులను కోల్పోవడం బాధాకరమని, ఇలాంటి కష్ట సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వారి వెంట మాజీ జడ్పీటీసీ బాలాజీ నాయక్, మాజీ సర్పంచ్ బాలాజీ, నాయకులు చిట్టి బాబు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు...

మున్నూరు కాపులు రాజకీయ శక్తిగా ఎదగాలి

- ఖమ్మం మేయర్ పదవే లక్ష్యం
- మున్నూరు కాపులకు ఆర్ జె సి కృష్ణ పిలుపు



ఖమ్మం /స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

"రాబోయే ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో ఇతర కులాలను కలుపుకొని పోతూ, మేయర్ పదవిని ప్రధాన లక్ష్యంగా చేసుకుని మున్నూరు కాపులను ఒక గొప్ప రాజకీయ శక్తిగా తీర్చిదిద్దాలి" అని ఆర్ జె సి కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం ఆర్ జే సీ కృష్ణ నివాసంలో అయన అధ్యక్షతన జరిగిన కొండా దేవయ్య కాపు సంఘం జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో అయన మాట్లాడారు.కొండా దేవయ్య నాయకత్వంలోని మున్నూరు కాపు సంఘాన్ని అతి త్వరలోనే విస్తృతపరుస్తామని శెట్టి రంగారావు స్పష్టం చేశారు.?మాజీ సుడా చైర్మన్ బచ్చు విజయకుమార్ మాట్లాడుతూ.. సంఘం అనేది సరైన నిర్మాణంతో సాగాలని, మున్నూరు కాపుల చరిత్ర తెలియని వారి చేతుల్లోకి వెళ్లకుండా, కేవలం వ్యక్తి ఆరాధనలకు లేదా మూడు కుటుంబాల పాలనకు పరిమితమయ్యే సంస్థగా మారకూడదని అన్నారు.గత పదేళ్లపాటు ఈ సంఘాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశారని లక్కినేని సుధీర్ ఆవేదన వ్యక్తం చేశారు.?సంఘం కేవలం ఖమ్మం పట్టణానికే పరిమితం కాకుండా జిల్లావ్యాప్తంగా విస్తరించాలని రాపర్తి శరత్ సూచించగా, సేవా రంగంలోనూ మన సంఘాన్ని ముందు వరుసలో నిలపాలని పొన్నం వెంకటేశ్వర్లు కోరారు. ఈ కార్యక్రమంలో కనిశెట్టి నరసయ్య, సాగర్, పిన్ని కోటేశ్వరరావు, మాటేటి కిరణ్, లక్కినేని సుధీర్ శ్రీదేవి, పసుపులేటి నాగరాజు, ఎర్ర జ్ఞానేశ్, రియల్ ఎస్టేట్ అధ్యక్షుడు వరప్రసాద్, నాలం సతీష్, గుండెపునేని రాజా తాళ్ళూరి రవి, మేకల శంకర్ బాబు, ఎండిఓ రవి, మూలగుండ్ల శ్రీహరి, కనకం భద్రయ్య, రాగం శ్యామ్, వెన్నపండు శ్రీధర్, మూగల శ్రీను, రావూరి నరసింహారావు, ఉప్పు వెంకటేశ్వర్లు సహా భారీ సంఖ్యలో ప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

పదోన్నతులతో బాధ్యతలు పెరుగుతాయి

ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలి.

జిల్లా ఎస్.పి: రాజేష్ చంద్ర



కామారెడ్డి జిల్లా/ ఎల్లారెడ్డి/ అక్టోబర్ 25/ అక్షరం న్యూస్: పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ కానిస్టేబు ల్ ల నుంచి హెడ్ కానిస్టేబుల్ గా పదోన్నతి పొందిన 7 గురు సిబ్బందికి జిల్లా ఎస్పీ ఎం. రాజేష్ చంద్ర అభినం దించారు.ఆదివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్ పిని కలిసిన సిబ్బంది పుష్ప గుచ్చాలను అందజేసి కృత జ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పదోన్నతి అనేది సిబ్బంది పనితీరును గుర్తింపుతోపాటు కొత్త బాధ్యతలకు నాంది అని పేర్కొన్నారు.విధి నిర్వహ ణలో క్రమశిక్షణ, నిజాయితీ, అంకితభావాన్ని పాటిస్తూ ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరిం చేందుకు కృషి చేయడంతో పాటు శాంతి భద్రతల పరిర క్షణలో కీలకపాత్ర పోషించాలని అన్నారు.పదోన్నతి పొం దిన వారిలో బి.రమేష్ (పిసిఆర్ కంట్రోల్ రూమ్),ఎం స దయ్య రామారెడ్డి,జి.సాయిలు బాన్సువాడ,పి. రాధాకృ ష్ణ బిచ్కుంద,కె. రమేష్ , బన్సీలాల్ లింగంపేట్,టి.వీర బాబు బీర్కూరు ఉన్నారు.

ముఖ్యమంత్రి సహాయనిధి ..కళ్యాణ లక్ష్మి ముబారక్ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే రాందాస్ నాయక్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

వైరా ఎమ్మెల్యే కార్యాలయంలో వైరా నియోజకవర్గానికి సంబంధించిన ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) చెక్కులతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల

పంపిణీ కార్యక్రమం శాసనసభ్యులు మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీచేసినారు ..ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంర్ఫ్) చెక్కుల వివరాలు ఏన్కూర్ మండలం -- 37.వైరా గ్రామీణ మండలం -- 42. వైరా పట్టణం -- 28సింగరేణి మండలం -- 37కొణిజర్లమండలం54జూలూరుపాడుమండలలం 21మొత్తం సీఎంర్ఫ్ చెక్కులు: 219కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్ వైరా మండలం -- 33 చెక్కుల. జూలూరుపాడు మంలం 48 చెక్కులుమొత్తం కళ్యాణలక్ష్మి / షాదీ ముబారక్ చెక్కులు: 81 అందజేసినఎ అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలతో పాటు మహిళలకు కల్యాణ లక్ష్మి షాదీ ముబారక్ ప్రభుత్వంతో చేపడుతున్న కార్యక్రమాలను విరివిగా ప్రచారం చేయాలని నాయకులకు కార్యకర్తలకు పిలుపునిచ్చారు సంక్షేమం అంటేనే కాంగ్రెస్ కాంగ్రెస్ అంటేనే సంక్షేమని అన్ని వర్గాల ప్రజలను ఆకట్టుకునే ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ ప్రభుత్వమని ఆయన తెలిపారు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు రాబోయే పట్టబద్రు ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసే అభ్యర్థిని అత్యధిక మెజార్టీ గెలిపించాలని కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమాల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావుబొర్ర రాజశేఖర్ టీపీసీసీ కార్యదర్శి కట్ల రంగారావు మండల పార్టీ అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షులు వీరం శెట్టి సీతారాములు డాక్టర్ సెల్ అధ్యక్షులు డాక్టర్ మురళీకృష్ణ మచ్చ బుజ్జితదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన కాంగ్రెస్ నాయకులు



ఖమ్మం/వైరా టౌన్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

వైరా: ఖమ్మం--నల్గొండ--వరంగల్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని వైరా ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కొనిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, ఉపసర్పంచ్ కొనకంచి మోషా, సొసైటీ మాజీ చైర్మన్ నెల్లూరు రమేష్, గుదే ఉపేందర్ తదితరులు ఎమ్మెల్సీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ రెడ్డిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.అంతకుముందు వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియపై నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రామదాసు నాయక్ పాల్గొని, అర్హులైన పట్టభద్రులందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు, పట్టభద్రులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించి, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో చర్చించారు.

మ్యాజిక్ రాజాను సన్మానించిన జబర్దస్త్ కళాకారులు

•కమాన్‌పూర్‌లో దుర్గాదేవి శోభాయాత్ర సందర్భంగా ప్రత్యేక సత్కారం



జ్యోతినగర్, ఎన్టీపీసీ అక్టోబర్ 25 పెద్దపల్లి జిల్లా అక్షరం న్యూస్ : కమాన్‌పూర్‌లో శనివారం రాత్రి నిర్వహించిన దుర్గాదేవి శోభాయాత్ర కార్యక్రమం సందడిగా సాగింది. ఈ సందర్భంగా ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యాఖ్యాత మ్యాజిక్ రాజాను జబర్దస్త్ బృందానికి చెందిన బుల్లెట్ భాస్కర్, ఫహీమా సన్మానించారు. కళారంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న మ్యాజిక్ రాజాను ప్రముఖ హాస్య కళాకారులు సత్కరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.గోదావరిఖనికి చెందిన మ్యాజిక్ రాజా ఇంద్రజాల ప్రదర్శనలతో పాటు వ్యాఖ్యాతగా కూడా ప్రేక్షకులకు సుపరిచితులు. తన మాటతీరుతో, ప్రదర్శనలతో ప్రేక్షకులను ఆకట్టుకునే ఆయనకు జబర్దస్త్ కళాకారుల చేతుల మీదుగా సన్మానం అందుకోవడం ఆనందాన్ని కలిగించింది.ఈ సందర్భంగా మ్యాజిక్ రాజా తనదైన శైలిలో స్పందిస్తూ.. “మై తో గోదావరిఖని వాలా.. తో క్యా హై? హమ్ కిసీసే కమ్ నహీ!” అంటూ తన ఆత్మవిశ్వాసాన్ని చాటుకున్నారు. గోదావరిఖని ప్రాంతానికి చెందిన కళాకారులు ఎక్కడికి వెళ్లినా తమ ప్రతిభతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోగలరనే భావనను ఆయన మాటలు ప్రతిబింబించాయి.దుర్గాదేవి శోభాయాత్ర సందర్భంగా జరిగిన ఈ సన్మానం మ్యాజిక్ రాజాకు మధుర జ్ఞాపకంగా నిలిచింది. స్థానిక కళాకారులకు ప్రముఖుల నుంచి లభించే గుర్తింపు మరింత ప్రోత్సాహాన్నిస్తుందని ఈ సందర్భంగా పలువురు అభిప్రాయపడ్డారు.

ఆర్యవైశ్యుల కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయడంతో పాటు అర్హులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలి

• ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గుమ్మడవెల్లి శ్రీనివాస్




ఖమ్మం/ స్టాఫ్ రిపోర్టర్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

ఖమ్మం : రాష్ట్ర ప్రభుత్వంలో ఆర్యవైశ్యులకు రాజకీయంగా , పరిపాలనా పరంగా సముచిత ప్రాతినిధ్యం కల్పించాలని ఖమ్మం నగర ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు గుమ్మడవెల్లి శ్రీనివాస్ కోరారు . ఆర్యవైశ్య కార్పొరేషన్‌కు తగినన్ని నిధులు కేటాయించి పేద ఆర్యవైశ్యులకు ఆర్థికంగా అండగా నిలవాలని విజ్ఞప్తి చేశారు . గత ప్రభుత్వ హయాంలో ఐదుగురు ఆర్యవైశ్యులకు చైర్మన్ పదవులు కల్పించగా , ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటివరకు ఒక్క పదవి కూడా దక్కలేదని ఆయన పేర్కొన్నారు . కార్పొరేషన్ ఏర్పాటు చేసినప్పటికీ నిధుల కొరతతో పేద విద్యార్థులు , నిరుద్యోగులు , చిన్న వ్యాపారులకు ప్రయోజనం చేకూరడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు . ఖమ్మం జిల్లాకు చెందిన అర్హులైన ఆర్యవైశ్య కాంగ్రెస్ నాయకులకు కార్పొరేషన్ చైర్మన్ పదవి కేటాయించాలని , ఇతర జిల్లాల్లోనూ అర్హులకు మరో రెండు , మూడు చైర్మన్ పదవులు ఇవ్వాలని కోరారు . ఈ అంశంపై ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పసుమర్తి సీతా చంద్రరావు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేశారని తెలిపారు . ఆర్యవైశ్యుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి , కార్పొరేషన్‌కు నిధులు విడుదల చేయడంతో పాటు అర్హులకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని గుమ్మడవెల్లి శ్రీనివాస్ కోరారు .

కాంగ్రెస్ పార్టీ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలి ..

•వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్) వైరా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీఆధ్వర్యంలోఎమ్మెల్సీ ఓటర్ల నమోదు కార్యక్రమం పైనియోజకవర్గస్థాయి పార్టీ నాయకులు బిఎల్ వో లతో . సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఖమ్మం జిల్లా టీపీసీసీ కోఆర్డినేటర్

జిల్లా ఇన్చార్జ్ దుద్దిల్ల శ్రీను బాబు ఏఐసీసీ కోఆర్డినేటర్ వేగి వెంకటేష్ పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ రెడ్డి సుడా చైర్మన్ పువాళ్ల దుర్గాప్రసాద్, టిపిసిసి అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్,రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి పాల్గొన్నారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం నల్గొండ వరంగల్ జిల్లాల కాంగ్రెస్ పార్టీ పట్ట బద్రులఎమ్మెల్సీ అభ్యర్థి సర్వోత్తమ్ రెడ్డి గెలుపే లక్ష్యంగా పార్టీ కార్యకర్తలు కృషి చేయాలనీ పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో క్లస్టర్ల వారీగా పట్టబద్రుల ఓటర్లను నమోదు చేయించాలనీ కోరారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు మాజీ మంత్రులు స్వర్గీయ రామ్ రెడ్డి వెంకటరెడ్డి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి తనయుడు పట్టబద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సర్వోత్తమ రెడ్డి పోటీ చేస్తున్నారని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ధ్యేయంగా పనిచేస్తుందని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించాలని కోరారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ

సీఎం మల్లు భట్టి విక్రమార్క సారధ్యంలో రాష్ట్రాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తున్నారని తెలిపారుదేశంలో ఎల్ నినో ప్రభావం పై జరిగే ఇబ్బందుల గురించి ప్రజలకు తెలియజేయాలనీ

నీటిని పొదుపుగా వాడుకోవాలని కోరారు.

ఎల్నినో ప్రభావం వలన వ్యవసాయ రంగంపై

నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని పంటల సాగును తగ్గించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో

పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ట రంగారావు జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, జిల్లా మహిళ కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య , సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు అబ్బూరి నరహరి,మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ,మున్సిపల్ వైస్ చైర్మన్ కట్ల సంతోష్ మార్కెట్ చైర్మన్ బోళ్ళ గంగారావు, జిల్లా అధికార ప్రతినిధి పమ్మి అశోక్, దాసరి దానియేలు,మండల అధ్యక్షులు శీలం చంద్రశేఖర్ రెడ్డి పట్టణ అధ్యక్షుడు సీతారాములు, గ్రామ సర్పంచులు ఐదు మండలాల మండల అధ్యక్షులు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాఘవపూర్‌లో యువకుడి ఘటనపై చర్చ

•మాజీ సర్పంచ్ అడపు వెంకటేష్‌కు గ్రామస్తుల మద్దతు

•ఫిర్యాదుపై నిష్పక్షపాత విచారణ జరపాలని విజ్ఞప్తి

•అధికార బలంతో రాఘవాపూర్ సర్పంచ్ దాడి

•దళితులకు అన్యాయం చేసేది బిఆర్ఎస్ నాయకులు

• ప్రాణాపాయం నుండి బయట పడ్డ వ్యక్తి

•రాఘవాపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేశం



పెద్దపల్లి టౌన్ అక్టోబర్ 25 అక్షరం న్యూస్

ప్రజాస్వామ్యాన్ని కాపాడాలిసిన అధికారులే దాడులను ప్రేరేపిస్తూ అధికార బలంతో నా అనుచరులపై కత్తులతో దాడి చేయడం సిగ్గుచేటని. రాఘవాపూర్ మాజీ సర్పంచ్ ఆడెపు వెంకటేషం అన్నారు ఆదివారం రాఘవాపూర్ లొని తన నివాసంలో వేలేకరుల సమావేశం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ మాట్లాడుతూ. నాపై కక్షతో నా అనుచరులపై దాడి చేయడం సరికాదని. దాడికి పోలీస్ అధికారులు రాజ్యాగ బద్దంగా ఎన్నుకున్న అధికారులు కూడా దాడిని ప్రేరేపించడం బాధాకరం అన్నారు. రాఘవాపూర్ లో బిఆర్ఎస్ అనుచరుల రౌడీ వాతావరణం నేలకొందని. తాను సర్పంచ్ గా ఉన్నప్పుడు ప్రతి వ్యక్తికి న్యాయం జరిగిందని తెలిపారు. కేవలం నా పైన రాజకీయ కక్షతో నా అనుచరుల పైన దాడులకు పాల్పడుతున్నారని తెలిపారు పెద్దపల్లి జిల్లా రాఘవపూర్ గ్రామంలో ఓ ముస్లిం యువకుడికి సంబంధించిన ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. ఈ వ్యవహారంలో గ్రామానికి చెందిన కళ్లపల్లి అశోక్, మోదుగుపల్లి శ్రావణ్, కుమ్మరి నవీన్‌పై పెద్దపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం. యువకుడిపై దాడి జరిగిందని, బెదిరింపులు ఎదురవుతున్నాయని ఫిర్యాదుదారుల తరపున ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో పోలీసులు విచారణ జరిపి వాస్తవాలను నిర్ధారించాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రామంలో ప్రశాంత వాతావరణం నెలకొనాలి

ఈ ఘటనపై మాజీ సర్పంచ్ అడపు వెంకటేష్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, గ్రామంలో ప్రజల మధ్య సఖ్యత, శాంతి సామరస్యాలు కొనసాగేందుకు సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామంలో చోటుచేసుకుంటున్నాయని చెబుతున్న వివిధ సమస్యలపై సమగ్ర విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా స్పందించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ భేదాభిప్రాయాలు వ్యక్తిగత విభేదాలకు దారితీయకుండా ప్రతి ఒక్కరూ సంయమనం పాటించాలని సూచించారు.

మాజీ సర్పంచ్‌కు గ్రామస్తుల మద్దతు

మరోవైపు, మాజీ సర్పంచ్ అడపు వెంకటేష్‌కు గ్రామానికి చెందిన పలువురు దళిత సోదరులు, పెద్దమనుషులు, గ్రామ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మద్దతు తెలిపినట్లు సమాచారం. గ్రామంలో ప్రజలకు అవసరమైన సమయంలో సహాయం చేయడం, అనారోగ్యంతో బాధపడేవారికి ఆర్థికంగా అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాల్లో వెంకటేష్ ముందుంటారని వారు పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేసే వ్యక్తుల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని అభిప్రాయపడ్డారు.

నిష్పక్షపాత విచారణకు విజ్ఞప్తి

ఈ ఘటనకు సంబంధించి అందిన ఫిర్యాదుపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాల ఆధారంగా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. బాధిత యువకుడికి భద్రత కల్పించడంతో పాటు, గ్రామంలో ప్రశాంత వాతావరణం కొనసాగేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదుపై వైరాలో సమీక్ష

•ఎస్ ఐ ఆర్ అవకతవకలపై పోరాటం..

•చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి..

•ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్



ఖమ్మం/ వైరా టౌన్ అక్టోబర్ 25 (అక్షరం న్యూస్)

వైరా: ఉమ్మడి ఖమ్మం--నల్గొండ--వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డికి మద్దతుగా అర్హులైన పట్టభద్రుల ఓటరు నమోదు కార్యక్రమాన్ని క్లస్టర్ల వారీగా వేగవంతం చేయాలని వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు.వైరా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు, ఎల్‌నినో ప్రభావం, ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణలు, రాహుల్ గాంధీ పిలుపు మేరకు అక్టోబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంపై నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, బీఎల్వోలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్‌తో పాటు టీపీసీసీ కోఆర్డినేటర్, ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి దుద్దిళ్ల శ్రీనుబాబు, ఏఐసీసీ కోఆర్డినేటర్ వేగి వెంకటేష్, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలోని ఐదు మండలాలు, వైరా పట్టణ పరిధిలో అర్హులైన పట్టభద్రులను గుర్తించి ఓటరు నమోదుపై అవగాహన కల్పించాలని సూచించారు. క్లస్టర్ల వారీగా బాధ్యతలు కేటాయించి, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ నమోదు కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని కోరారు.కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రులు స్వర్గీయ రామ్ రెడ్డి వెంకటరెడ్డి, రామ్ రెడ్డి దామోదర్ రెడ్డిల కుటుంబానికి చెందిన రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని పేర్కొంటూ, పార్టీ శ్రేణులంతా ఎన్నికల ప్రక్రియపై దృష్టి సారించాలని తెలిపారు.

అదేవిధంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర

సవరణ (ఎస్ ఐఆర్) ప్రక్రియలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఓటర్ల హక్కుల పరిరక్షణ కోసం పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలని నాయకులు సూచించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు అక్టోబర్ 1న నిర్వహించే చలో ఢిల్లీ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనేలా సమన్వయం చేసుకోవాలని కోరారు.రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని నాయకులు సూచించారు.ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ రంగానికి ఎదురయ్యే అవకాశమున్న సవాళ్లపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని పేర్కొన్నారు. వాతావరణ పరిస్థితులు, నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు పంటల సాగుపై రైతులు నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి లోకేష్ యాదవ్, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి కట్టా రంగారావు, జిల్లా నాయకులు బొర్రా రాజశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు అబ్బూరి నరహరి, వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, వైస్ చైర్మన్ కట్ల సంతోష్, మార్కెట్ కమిటీ చైర్మన్ బోళ్ల గంగారావు, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి పమ్మి అశోక్, దాసరి దానియేలు, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వీరంశెట్టి సీతారాములు, ఐదు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, గ్రామ సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

శతక ధమాకా.. హర్మన్, దీప్తి సెంచరీలు

మెరిసిన వైష్ణవి

రెండో వన్డేలో భారత్ ఘన విజయం

2-0తో సిరీస్ సొంతం



121 పరుగుల తేడాతో జింబాబ్వే చిత్తు

వడోదర : చిన్న జట్టు జింబాబ్వేను భారత అమ్మాయిలు మరోసారి కుమ్మేశారు. మాజీ కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (121 బంతుల్లో 15 ఫోర్లతో 126), ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (86 బంతుల్లో 15 ఫోర్లతో 106 నాటౌట్) సెంచరీల మోతకు స్పిన్నర్ వైష్ణవి శర్మ (4/39) బంతితో మ్యాజిక్ చేయడంతో ఆదివారం జరిగిన రెండో వన్డేలో భారత్ 121 పరుగుల తేడాతో జింబాబ్వేను చిత్తు చేసింది. మరో మ్యాచ్ మిగిలుండగానే మూడు వన్డేల సిరీస్‌ను 2-0తో సొంతం చేసుకుంది. ఓపెనర్ ప్రతికా రావల్ (67) కూడా మెరవడంతో తొలుత భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 328/6 భారీ స్కోరు సాధించింది. ఛేదనలో జింబాబ్వే 48.5 ఓవర్లలో 207 రన్స్‌కే కుప్పకూలింది. ఓపెనర్ ముపచిక్వా (49), ముగెరి తిరిపనో (46) కాస్త పోరాడారు. దీప్తి శర్మ (3/35) మూడు వికెట్లు తీసింది. హర్మన్‌కు ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు లభించింది. మూడో, చివరి వన్డే బుధవారం జరుగుతుంది.

హర్మన్, దీప్తి జోరు

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఆరంభంలోనే షాక్ తగిలింది. కెప్టెన్ మంధాన (0) సిబాండ బౌలింగ్‌లో ఇన్నింగ్స్ రెండో బంతికే ఫిరికి క్యాచ్ ఇచ్చి ఔటవగా.. గత మ్యాచ్‌లో మెరుపు ఫిఫ్టీ కొట్టిన వన్‌డౌన్ బ్యాటర్ షఫాలీ వర్మ (8) సైతం నిరాశపరిచింది. సిబాండ బౌలింగ్‌లోనే ఆమె కూడా వెనుదిరగడంతో భారత్ 19/2తో నిలిచింది. ఈ దశలో ఇన్నింగ్స్‌ను నిలబెట్టే బాధ్యతను హర్మన్, తొలి మ్యాచ్ సెంచరీ హిట్టర్ ప్రతికా రావల్ తీసుకున్నారు. పవర్ ప్లేలో ఇద్దరూ క్రమం తప్పకుండా బౌండరీలు కొట్టారు. తొలుత 57 బంతుల్లో ప్రతికా అర్ధ శతకం పూర్తి చేయగా.. హర్మన్ 51 బంతుల్లో ఈ మార్కు దాటింది. రెండు సిక్సర్లతో దూకుడు పెంచి శతకం దిశగా సాగుతున్న ప్రతికాను 23వ ఓవర్లో న్యాషా ఔట్ చేయడంతో మూడో వికెట్‌కు 124 పరుగుల భాగస్వామ్యం విడిపోయింది. తర్వాతి ఓవర్లోనే తేజల్ హసబ్నిస్ (3) ఒలిండర్ పెవిలియన్ చేర్చడంతో భారత ఇన్నింగ్స్ మళ్లీ తబడినట్టు కనిపించింది. తర్వాతి ఓవర్లో హర్మన్ ఇచ్చిన సింపుల్ క్యాచ్‌ను నొకొమో డ్రాప్ చేసింది. ఈ చాన్స్‌ను సద్వినియోగం చేసుకున్న హర్మన్ ప్రత్యర్థికి ఎలాంటి చాన్స్ ఇవ్వలేదు. తన మార్కు కవర్ డ్రైవ్‌లు, కట్ షాట్లతో అభిమానులను అలరిస్తూ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించింది. కెప్టెన్సీ భారం లేకపోవడంతో స్వేచ్ఛగా ఆడిన కౌర్‌కు ఆల్ రౌండర్ దీప్తి శర్మ తోడవ్వడంతో భారత స్కోరు బోర్డు పరుగులు పెట్టింది. దీప్తి కూడా బౌండరీలు కొట్టేందుకు మాజీ కెప్టెన్‌తో పోటీపడింది. తను టీ20 స్టయిల్లో ఆడి ఆడి 37 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకోగా.. బిజా వేసిన 41వ ఓవర్లో డబుల్‌తో హర్మన్ తన కెరీర్‌లో 8వ వన్డే శతకాన్ని (101 బంతుల్లో) పూర్తి చేసుకుంది. సెంచరీ తర్వాత హర్మన్ ఇచ్చిన మరో రెండు క్యాచ్‌లను ఫీల్డర్లు నేలపాలు చేయడం జింబాబ్వేను దెబ్బతీసింది. చివరకు 47వ ఓవర్లో మవుంగ వేసిన స్లో ఫుల్లర్ డెలివరీకి హర్మన్ లాంగాఫ్‌లో క్యాచ్ ఇవ్వడంతోనాలుగో వికెట్‌కు ఏకంగా 153 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది. రిచా ఘోష్ (7) ఫెయిలైనా.. తన దూకుడు కొనసాగించిన దీప్తి చివరి ఓవర్లో రెండు ఫోర్లతో సెంచరీ పూర్తి చేసుకోవడంతో పాటు జట్టుకు భారీ స్కోరు అందించింది.


వైష్ణవి మ్యాజిక్

భారీ ఛేదనలో జింబాబ్వే ఏ దశలోనూ భారత్‌కు పోటీ ఇవ్వలేకపోయింది. ఓపెనర్ ముపచిక్వా పోరాడినా.. మరో ఓపెనర్ లోరైన్ ఫిరి (6) తడబడింది. తొమ్మిదో ఓవర్లో ఆమెను ఔట్ చేసిన తెలుగు స్పిన్నర్ శ్రీచరణి ప్రత్యర్థి పతనం ఆరంభించింది. ఈ దశలో ముపచిక్వాకు తోడైన తిరిపనో రెండో వికెట్‌కు 69 పరుగులు జోడించి భారత బౌలర్లను విసిగించింది. కానీ, 23వ ఓవర్లో సయాలీ సత్ఘారే అద్భుతమైన బంతితో ఆమెను బౌల్డ్ చేసి భారత్‌కు కీలక బ్రేక్ ఇచ్చింది. ఇక్కడి నుంచి వైష్ణవి మాయ మొదలైంది. 28వ ఓవర్లో ముపచిక్వాను పెవిలియన్ చేర్చిన ఆమె కాసేపు ప్రతిఘటించిన బిజ్వా (34)తో పాటు మవుంగా (3), జోసెఫిన్ నకొమో (20)ను తన వరుస ఓవర్లలో వెనక్కుపంపి భారత్‌కు ఘన విజయం ఖాయం చేసింది. బ్యాట్‌తో శతకబాదిన దీప్తి చివర్లో తన స్పిన్ మ్యాజిక్ చూపెట్టింది. 46వ ఓవర్లో వరుస బంతుల్లో న్యాషా (20), సిబండా (0)ను ఔట్ చేసిన తన తర్వాతి ఓవర్లో మకుషా (0) పని కూడా పట్టింది. జింతిమణి కలిత బౌలింగ్‌లో దురురు (12) ఆఖరి వికెట్‌గా సబ్‌స్టిట్యూట్ ప్లేయర్ హర్లీన్‌కు క్యాచ్ ఇవ్వడంతో జింబాబ్వే పోరాటం ముగిసింది.

8 వన్డేల్లో హర్మన్‌ప్రీత్‌కు ఇది 8వ సెంచరీ. భారత్ తరపున ఈ ఫార్మాట్‌లో అత్యధిక శతకాలు చేసిన రెండో బ్యాటర్‌గా మిథాలీ రాజ్ (7)ను అధిగమించింది. మంధాన (14) అగ్రస్థానంలో ఉంది.

హ్యాట్రిక్‌పై హైదరాబాద్ గురి

నేటి నుంచి జింఖానాలో పంజాబ్‌తో రంజీ మ్యాచ్



హైదరాబాద్, రంజీ ట్రోఫీలో వరుసగా రెండు విజయాలతో జోష్‌లో ఉన్న హైదరాబాద్ మూడో విక్టరీతో హ్యాట్రిక్ కొట్టాలని చూస్తోంది. ఎలైట్ గ్రూప్-బిలో భాగంగా సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో సోమవారం నుంచి జరిగే తమ మూడో పోరులో బలమైన పంజాబ్‌తో తలపడనుంది. ఫలితం తేలే పిచ్‌పై స్పష్టమైన విజయం సాధించాలనే లక్ష్యంతో హైదరాబాద్ యాజమాన్యం ఈ పోరును ఉప్పల్ నుంచి జింఖానా గ్రౌండ్‌కు మార్చింది. త్రిపుర, ఆంధ్రపై జట్టు గెలిచిన హైదరాబాద్‌కు కెప్టెన్‌గా ఉన్న స్టార్ ప్లేసర్ మహ్మద్ సిరాజ్ తో పాటు టీమిండియా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ పంజాబ్‌కు అందుబాటులో లేనప్పటికీ, ఇరు జట్లలోనూ ప్రతిభావంతులైన ఆటగాళ్ళు ఉన్నారు.

పేస్ ఆల్‌రౌండర్ సీవీ మిలింద్ కెప్టెన్సీలో బరిలో నిలిచిన హైదరాబాద్ బ్యాటింగ్ లైనప్‌లో తన్మయ్ అగర్వాల్, అభిరథ్ రెడ్డి, జి. రాహుల్ సింగ్, కె. హిమతేజ, రాహుల్ రాదేష్‌తో బలంగా ఉంది. బౌలింగ్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లోనే 20 వికెట్లు పడగొట్టిన స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్, జి. అనికేత్ రెడ్డి ప్రధాన ఆయుధాలుగా మారనున్నారు. మరోవైపు పంజాబ్‌కు ఐపీఎల్ స్టార్ ప్రభ్‌సిమ్రన్ సింగ్, సలీల్ అరోరా, ఈమాన్‌జోత్ సింగ్‌తో పాటు పేసర్ ఉమేష్ యాదవ్, స్పిన్నర్ హర్‌ప్రీత్ బ్రార్ అదనపు బలాన్ని ఇస్తున్నారు.

పడిక్కల్, సుదర్శన్ పోరాటం



లింకన్ : న్యూజిలాండ్-ఏతో తొలి అనధికారిక టెస్టులో భారత్-ఏ పుంజుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో పేలవంగా ఆడి ప్రత్యర్థికి భారీ ఆధిక్యం సమర్పించుకున్న జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ప్రత్యర్థికి గట్టి పోటీనిస్తోంది. రెండో రోజు, ఆదివారం ఆట ముగిసే సమయానికి 36 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 106 పరుగులు చేసింది. స్టార్ ఓపెనర్లు యశస్వి జైస్వాల్ (5), కేఎల్ రాహుల్ (4)మళ్లీ విఫలమైనా... దేవ్‌దత్ పడిక్కల్ (89 బంతుల్లో 56 బ్యాటింగ్), సాయి సుదర్శన్ (104 బంతుల్లో 39 బ్యాటింగ్) బాధ్యతాయుతంగా బ్యాటింగ్ చేశారు. కివీస్ స్కోరుకు భారత్ ఇంకా 98 పరుగుల వెనుకంజలోనే ఉంది. అంతకుముందు 135/3 ఓవర్‌నైట్ స్కోరుతో రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన కివీస్-ఏ జట్టు 89.3 ఓవర్లలో 317 స్కోరుకు ఆలౌటై 204 పరుగుల ఆధిక్యాన్ని దక్కించుకుంది. కెప్టెన్ రైస్ మారియు (76) టాప్ స్కోరర్‌గా నిలవగా, డీన్ ఫోక్స్‌క్రాఫ్ట్ (51), క్రిస్టియన్ క్లార్క్ (42) రాణించారు. భారత బౌలర్లలో అన్షుల్ కంబోజ్ (3/52), ఆకిబ్ నబీ (3/69) చెరో 3 వికెట్లు పడగొట్టారు.

యూకీ భాంబ్రీకి టైటిల్




ఆల్మటీ (కజకిస్తాన్) : భారత డబు ల్స్ టెన్నిస్ స్టార్ యూకీ భాంబ్రీ ఈ సీజన్‌లో తన తొలి ఏటీపీ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఆల్మటీ ఓపెన్ ఏటీపీ 250 టోర్నమెంట్ పురుషుల డబుల్స్ లో విజేతగా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో నాలుగో సీడ్ యూకీ భాంబ్రీ (భారత్)- ర్యాన్ సెగర్‌మన్ (అమెరికా) జంట 7-6(7/3), 6-7(1/7), 10-2 తో టాప్ సీడ్ లూకాస్ మీడ్లర్ -- నీల్ ఒబెర్లీట్నర్ (ఆస్ట్రియా) జోడీపై ఉత్కంఠ విజయం సాధించి చాంపియన్‌గా నిలిచింది. యూకీ కెరీర్‌లో ఇది ఐదో ఏటీపీ డబుల్స్ టైటిల్ కావడం విశేషం.

టెన్నిస్ సంఘం ఎన్నికల బరిలో సానియా, భూపతి

న్యూఢిల్లీ: అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) వచ్చే నెల 7న నిర్వహించనున్న విశిష్ట క్రీడాకారుల (ఎస్ఓఎం)ఎన్నికల రేసులో భారత టెన్నిస్ దిగ్గజాలు మహేశ్ భూపతి, సానియా మీర్జా నిలిచారు. ఈ ఇద్దరూ జనరల్ బాడీతో పాటు ఎగ్జిక్యూటివ్ కమిటీ స్థానాలకు ఆదివారం నామినేషన్లు దాఖలు చేశారు. అయితే, ఏఐటీఏ అధ్యక్ష పదవికి పోటీ పడతారని భావించిన మరో దిగ్గజం లియాండర్ పేస్ ఈ ఎన్నికల్లో నామినేషన్ వేయకపోవడం గమనార్హం. నూతన క్రీడా పాలన చట్టం ప్రకారం రాష్ట్ర సంఘాల్లో పాలనా అనుభవం లేని పేస్ ఎస్ఓఎం కోటా నామినేషన్ కూడా వేయకపోవడంతో వచ్చే నెల 27న జరిగే ఏఐటీఏ అధ్యక్ష పదవి రేసు నుంచి తప్పుకున్నట్లయింది.

షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక.. థియేటర్లలోకి 'డిడిఎల్‌జె' రీ-రిలీజ్!



బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ సిద్ధమవుతోంది. షారుఖ్ కెరీర్‌లో ఆల్ టైమ్ బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన కల్ట్ క్లాసిక్ లవ్ స్టోరీ 'దిల్ వాలే దుల్హానియా లే జాయేంగే' (ణఖూజీ) చిత్రాన్ని ఆయన పుట్టినరోజు సందర్భంగా ప్రత్యేకంగా థియేటర్లలో రీ-రిలీజ్ చేయనున్నారు. షేర్ బాగ్, పివిఆర్, ఐనాక్స్ వంటి ప్రముఖ మల్టీప్లెక్స్ చైన్లలో పరిమిత స్క్రీన్‌లలో ఈ సినిమాను ప్రదర్శించనున్నారు. రాజ్ అండ్ సిమ్రాన్ ల మ్యాజికల్ లవ్ స్టోరీని మరోసారి బిగ్ స్క్రీన్‌పై చూసేందుకు అభిమానులు ఎంతగానో ఆతృతగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు షారుఖ్ బర్త్‌డే కావడంతో ఆయన నటించిన మోస్ట్ అవేటెడ్ మూవీ 'కింగ్' టీజర్‌ను కూడా విడుదల చేయనున్నట్లు సమాచారం.

సింధు 11వ సారీ

- **అన్ సె యంగ్ చేతిలో ఓటమి**
- **ఫ్రెంచ్ ఓపెన్‌లో రన్నరప్‌తో సరి**



పారిస్: భారత స్టార్ షట్లర్ పీవీ సింధుకు మళ్లీ నిరాశే. వరల్డ్ నంబర్ వన్ అన్ సె యంగ్ అడ్డును మరోసారి దాటలేపోయిన సింధు ఫ్రెంచ్ ఓపెన్ సూపర్ 750 టోర్నమెంట్‌లో రన్నరప్‌తో సరిపెట్టింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ టైటిల్ పోరులో సింధు 21-16, 11-21, 12-21తో టాప్ సీడ్ దక్షిణ కొరియా స్టార్ సె యంగ్ చేతిలో పోరాడి ఓడిపోయింది. సెయంగ్ చేతిలో సింధుకు ఇది వరుసగా 11వ ఓటమి. గంటకు పైగా సాగిన ఫైనల్ పోరులో తొలి గేమ్‌లో సింధు అద్భుతంగా ఆడింది.తన ఎత్తును ఉపయోగించుకుంటూ పవర్ ఫుల్ స్మాష్‌లు, క్రాస్ కోర్ట్ స్మాష్‌లతో విజృంభించి తొలి గేమ్‌ను గెలుచుకుంది. కానీ, రెండో గేమ్‌లో అన్ సె యంగ్ తన అసలు నైపుణ్యాన్ని బయటకు తీసింది. లైన్‌ను పక్కాగా అంచనా వేయడంతో పాటు నిలకడైన నెట్ ప్లేతో సింధును ఒత్తిడిలోకి నెడుతూమ్యాచ్‌ను మూడో గేమ్‌కు తీసుకెళ్లింది. నిర్ణయాత్మక గేమ్ ఆరంభంలో గట్టి పోటీ ఇచ్చిన సింధు 8-5తో ఆధిక్యంలో నిలిచి టైటిల్‌పై ఆశలు రేపింది. కానీ, సెయంగ్ వెంటనే పుంజుకుని స్కోరును 8-8తో సమం చేశాక పవర్ ఫుల్ షాట్లతో చెలరేగింది. ఒత్తిడిలో సింధు అనవసర తప్పిదాలు చేసి మ్యాచ్ కోల్పోయింది.

హైదరాబాద్‌లోనే అనుకున్నాం..



న్యూజిలాండ్‌తో రెండో టీ20ఐ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించిన యువ బ్యాటర్లు తిలక్ వర్మ, నితీశ్ రెడ్డి మ్యాచ్ అనంతరం తమ అనుభవాలను పంచుకున్నారు. కష్టకాలంలో జట్టును గెలిపించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తిలక్ మాట్లాడుతూ.. 'ఈ విజయం మాకు చాలా ప్రత్యేకం. నిజానికి హైదరాబాద్‌లో ఉన్నప్పుడే మేమిద్దరం ఒక మాట అనుకున్నాం.. ఒకవేళ క్లిష్ట పరిస్థితి వస్తే ఇద్దరం తెలుగు కుర్రాళ్లం క్రీజులో ఉండి మ్యాచ్‌ను గెలిపించాలకున్నాం. కానీ, నేను ఎప్పుడూ నమ్మేది ఒక్కటే.. భగవంతుడికి మన కోసం ఎప్పుడు ఏం చేయాలో సరైన సమయమే తెలుస్తుంది. మనం చేయాల్సిందల్లా ప్రక్రియను నమ్ముతూ కష్టపడటమే.. సరైన సమయం వచ్చినప్పుడు ఫలితాలు వాటంతట అవే వస్తాయి' అని పేర్కొన్నాడు. ఇక, తిలక్‌తో కలిసి బ్యాటింగ్ చేయ డం ఎంతో ఆనందాన్నిచ్చిందని నితీశ్ అన్నాడు. 'మేమిద్దరం మంచి రన్-రన్నర్స్ కావడంతో సింగిల్స్ తీస్తూ స్కోరు బోర్డును నడిపించాం. నమన్ దూకుడుగా ఆడుతున్నప్పుడు తిలక్ ఎలాంటి రిస్క్ తీసుకోకుండా అతనికి అండగా నిలిచాడు. ఆ తర్వాత మా జంట చేసిన భాగస్వామ్యం జట్టును విజయతీరాలకు చేర్చింది' అని చెప్పాడు.

Printed, Published and Owned by Shaik Yacoob Pasha, Published at 7-4-29, Medarabasti Kothagudem, Bhadradri Kothagudem Districrt-507 101, Telangana. Printed at SUPHALA AKSHARAM Printers, RNI ref.no PRESS/2026/126/7878/00001375, e-mail: aksharamnewsts@gmail.com, Editor: SHAIK YACOOB PASHA, RNI NO. TELTEL/2018/75419, e-mail: aksharamtsnews@gmail.com. Mobile : 9391690609